రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న గౌసుద్దీన్

ముషీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, బోలక్‌పూర్ కార్పొరేటర్ మహ్మద్ గౌసుద్దీన్ సూచించారు. బుధవారం భోలక్‌పూర్‌లో సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ ఏఈ సుభాష్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి తవ్విన చోట వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఐఎం పార్టీ నాయకులు షరీఫ్, డాక్టర్ విక్రమ్, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కితే గుణపాఠం

● విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించిన వామపక్ష నేతలు


విద్యుత్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న కూనంనేని, తదితరులు

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కిన పాలకులకు ప్రజలు సరైన రీతిలో గుణపాఠం చెబుతున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఇందుకు నిదర్శనం గత ఎన్నికల్లో ఏపీలో చంద్రబాబునాయుడు, నేడు తెలంగాణలో కేసీఆర్ అని ఆయన అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా పాలన చేస్తుందని, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. బుధవారం బషీర్‌బాగ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఆనాటి పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన విద్యుత్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే అందుకు వ్యతిరేకంగా వామపక్షపార్టీలు, కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేసినందుకు గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పులు జరిపించిందన్నారు. నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరపగా ముగ్గురు అమరులయ్యారని గుర్తు చేశారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఇకనైనా పాలకులు విద్యుత్ సంస్కరణలను పక్కన పెట్టి విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రపంచ బ్యాంక్ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వాలు విద్యుత్ సంస్కరణలు తీసుకువస్తూ ప్రజలపై భారం మోపుతున్నారని ఆరోపించారు. విద్యుత్‌రంగాన్ని కాపాడుకోవాలన్న ఆయన, అందుకోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐఎంఎల్ మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్ రెడ్డి, గుమ్మడి నర్సయ్య, పీవోడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు సంధ్య, రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు నర్సింహ, సీపీఐ నగర కార్యదర్శి ఈటి నర్సింహ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు గోవర్ధన్, ఎంసీపీఐ నాయకుడు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర గ్రంథం



శ్రీలలితా విష్ణు సహస్రనామ స్తోత్ర గ్రంథం

రాంనగర్/చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీగణపతి మహా నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ప్రముఖ రచయిత, శ్రీశైలం దేవస్థానం పూర్వ ప్రత్యేక సలహాదారులు పురాణపండ శ్రీనివాస్ రచనా సంకలనం శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర వైభవ గ్రంథాన్ని జంటనగరాల్లోని సాంస్కృతిక, సాహిత్య, కళా సంస్థలకు, అర్చకులకు, వేదపండితులకు, వేద పాఠశాలలకు ఉచితంగా అందజేయనున్నట్లు శృంగేరీ జ్ఞాన సరస్వతీ ఆలయ అధికారి కళా జనార్దనమూర్తి తెలిపారు. స్తోత్ర విద్యలతో రూపుదిద్దుకున్న శ్రీలలితా విష్ణుసహస్రనామ స్తోత్ర మంగళ గ్రంథాన్ని సెప్టెంబర్ 3, 4వ తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిక్కడపల్లి త్యాగరాయ గానసభ, ముషీరాబాద్ గాంధీ ఆస్పత్రి ఎదురుగా ఉన్న జ్ఞాన సరస్వతీ ఆలయంలో పొందవచ్చని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ ప్రత్యేక సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య సౌజన్యంతో అందిస్తున్న గ్రంథాన్ని గత వారం హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఏపీ విజయవాడలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి సన్నిధానంలో ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి ఆవిష్కరించారని ఆయన తెలిపారు. తొలిసారిగా ఇంతటి మహాగ్రంథ వితరణకు పూనుకున్న తమకు ఈ పవిత్ర కార్యక్రమంలో సహకరించిన ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు.


విద్యార్థులకు చెక్కులను అందజేస్తున్న సరళ, శ్రీనివాస్‌రెడ్డి

పేద విద్యార్థులకు చేయూతనివ్వాలి

ముషీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేందుకు స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సహకారం అందించాలని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(ఎస్ఆర్‌డీ) డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎస్ఆర్‌డీ సంస్థ కార్యాలయంలో తల్లిదండ్రులను కోల్పోయిన 50 మంది విద్యార్థులకు స్కూల్ ఫీజు కోసం రూ.6 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతీ నెల విద్యార్థులకు పౌష్టికాహారం కిట్లు అందజేస్తున్నామని పేర్కొన్నారు. మూడేళ్లుగా విద్యార్థులకు స్కూల్ ఫీజులను సంస్థ ద్వారా చెల్లిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో హిల్ ఆఫ్ హోప్ ప్రతినిధి సరళ, ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, వెంకటేశ్వరి, నీలకంఠ, రజని, ప్రియా పాల్గొన్నారు.


బిరుదులు పొందిన వారితో అతిథులు

ఆకట్టుకున్న దేశభక్తి గీతాల గానలహరి

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాలుగా భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్ ఆదర్శ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సినీ సుస్వరాలు పేరిట జరుగుతున్న సినీ పాటల లహరి పరంపరంలో 62వ కార్యక్రమం ఆర్ఆర్ ఫౌండేషన్ సహకారంతో త్యాగరాయ గానసభలో బుధవారం జరిగింది. దేశభక్తి గీతాల గానలహరి పేరిట నిర్వహించిన కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రముఖ గాయని ఆమని, సహ గాయకులు సుభాష్, రాజన్, శ్రీమయి, శ్రీనివాస్ తదితరులు నాటి, నేటి సినిమాలలోని పాటలు మధురంగా గానం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా హాజరయ్యారు. ఐదు దశాబ్దాలుగా నాట్యరంగంలో ఉన్న కథక్ అంజుబాబును నాట్యసామ్రాట్, సేవారంగంలో ఉన్న పన్నాల బాల్‌రెడ్డిని సేవా సామ్రాట్, సంగీతరంగంలో ఉన్న కమలశాస్త్రిని స్వర శిరోమణి బిరుదులతో సత్కరించారు. దామోదర్‌గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వాలతోపాటు దాతలు కూడా ఆర్థికంగా బాధపడుతున్న కళాకారులను ఆదుకోవాలని సూచించారు. శ్రుతి లయ చైర్మన్ బొక్క బీంరెడ్డి, సీల్‌వెల్ చైర్మన్ బండారు సుబ్బారావు గాయనీగాయకులకు, సత్కారగ్రహీతలకు అభినందనలు తెలిపారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పార్వతీశం, రవికుమారి

అలరించిన సినీదర్శకుల 'స్వరమాలిక'

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీదర్శకుల స్వరమాలిక కార్యక్రమం శ్రోతలను అలరించింది. నిర్వాహకులు, గాయనీగాయకులు టి.రవికుమారి, జీఎస్‌జే కుమార్‌తో పాటు అమర్‌నాథ్‌దేశ్‌పాండే, వెంకన్నబాబు, సీతారామరాజు, ఒమర్, శారదాసాయి, రామలక్ష్మి, అలేఖ్య, ఉమాసింధు, తేజస్విని పలువురు సినీదర్శకులు దర్శకత్వం వహించిన సినిమాల్లో ఎంపిక చేసుకున్న మధురగీతాలు వినిపించారు. ఈ కార్యక్రమానికి సాహితీవేత్త ఓలేటి పార్వతీశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిర్వాహకులు రవికుమార్, జీఎస్‌జే కుమార్‌ను సన్మానించారు. త్రినాథరావు, ఉమాదేవి, కోటేశ్వరరావు, శంతన్‌కుమార్, సదాశివరావు, పరందామన్, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌కుమార్

31న గణేశ్ మండపాల నిర్వాహకుల సమావేశం

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ముషీరాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈనెల 31న గణేశ్ మండపాల నిర్వాహకులతో భారీ సదస్సు నిర్వహిస్తున్నట్లు సమితి కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రాంనగర్‌లో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఉత్సవ సమితి నాయకులు శివాజీ, మహేందర్‌బాబు, శక్తిసింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల కిందట వరుణ్‌కుమార్ అనే వ్యక్తి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను చిక్కడపల్లి పోలీసులు బుధవారం అప్పగించారు. బాధితుడిని పీఎస్‌కు పిలిపించిన ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఫోన్ ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. టీటీడీ, గోశాల పరిధిలోని అలాహాబాద్ బ్యాంక్ ఏరియా, జమునా ప్లాజా, లోయర్‌ట్యాంక్‌బండ్, తాతానగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, గగన్‌మహల్, ఐసీఐసీఐ బ్యాంక్ పరిధిలోని సాధురామ్ ఐ ఆస్పత్రి ప్రాంతం, దోమలగూడ మార్కెట్, కామత్ హోటల్, ఏపీ ఫర్నిచర్ లేన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపాలి

● అధికారులకు కార్పొరేటర్ ఆదేశం


గంగపుత్ర వీధిలో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ, స్థానికులు

కవాడిగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని పూల్‌బాగ్, గంగపుత్ర వీధిలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ పనులు పూర్తయిన ప్రాంతాల్లో సీసీ రోడ్లకు ప్రతిపాదనలు పంపాలని కార్పొరేటర్ రచనశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానికుల ఫిర్యాదుల మేరకు బుధవారం ఆమె పూల్‌బాగ్, గంగపుత్ర వీధిలో పర్యటించారు. గుంతలమయమైన రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆమెకు చెప్పారు. ఈ సందర్భంగా రచనశ్రీ మాట్లాడుతూ ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, శివరాజ్, బీఆర్ఎస్ నేత రాజశేఖర్‌గౌడ్, స్థానికులు విఠల్‌రావు, పుష్ప, బస్తీవాసులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలి


వెంకటేశంకు నియామకపత్రం ఇస్తున్న చంటి ముదిరాజ్

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం బర్కత్‌పురలోని కమిటీ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మల్లం వెంకటేశంను నియమించారు. ఈ సందర్భంగా చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో ఆ వ్యక్తి కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కొందరు అధికారులు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు స్రవంతి, ఎం.శ్రీనివాస్‌గౌడ్, పి.రాజు గౌడ్, బత్తుల మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ ఘన స్వాగతం


ర్యాలీగా వెళ్తున్న ముఠా జైసింహ, శ్రీనివాస్‌రావు తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత తీహాడ్ జైలు నుంచి విడుదలై ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా ఘన స్వాగతం పలికేందుకు బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ర్యాలీని బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, సీనియర్ నాయకుడు పబ్బ కృష్ణ, డివిజన్ ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, బీసీ సెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, యువజన కమిటీ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు ప్రవీణ్, మహేష్, కల్యాణ్, సునీల్, కృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి మాలల బస్తీబాట


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీధర్, బల్వంత్‌రావు తదితరులు

నల్లకుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మాలలపై చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు, మాలలను చైతన్యవంతం చేసేందుకు ఈ నెల 29వ తేదీ నుంచి గ్రేటర్‌లోని అన్ని డివిజన్లలో మాలల బస్తీబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కన్వీనర్లు మన్నె శ్రీధర్, పి.బల్వంత్‌రావు తెలిపారు. నల్లకుంట డివిజన్ సత్యానగర్ కమ్యూనిటీహాల్లో రాష్ట్ర ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాలలకు అన్యాయం చేస్తే స్థానికసంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణపై త్వరలోనే సుప్రీంకోర్టులో పిల్ వేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్లు తాలుకా రాజేష్, బి.శ్రీనివాస్, అంజలి, గోకుల్ కల్యాణ్‌రావు, ఆదర్శమౌర్య, కొమరం క్రాంతి కుమార్, రాకేష్, బత్తుల రవి, గుమ్మల కమల్, రాకేష్, పసుల శ్రీనివాస్, ఉమాకాంత్, చేతన్, నర్సింగ్‌రావు, మర్రిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి


నిరసన వ్యక్తం చేస్తున్న మున్నూరుకాపు నేతలు

కవాడిగూడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుల అభివృద్ధికి ఐదువేల కోట్ల బడ్జెట్ కేటాయించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర అధ్యక్షుడు ఉగ్గే శ్రీనివాస్‌పటేల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మున్నూరుకాపులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు బీసీలకు 42 శాతం స్థానికసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చామకూర సుజాత, ఆకుల మంజు, సంగీత, కటికం మహేష్‌కుమార్, బత్తుల రాములు, చెలిమెల ప్రదీప్, బిల్లకంటి శ్రీనివాస్, రామిని సందీప్, వెంపటి సోమన్న, ప్రభాకర్, శ్యామ్, మల్లేష్, ప్రకాష్, నరేష్‌నాయిని, శ్రీనివాస్, పటోళ్ల రవి పాల్గొన్నారు.

'హైడ్రా'కు తప్పుడు పత్రాలు చూపించిన కాంగ్రెస్ : ఎడ్ల

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటపై మాజీ ఎంపీ వి.హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్‌కు తప్పుడు పత్రాలు చూపించారని బీఆర్ఎస్ అంబర్‌పేట నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం బుద్ధభవన్‌లో 'హైడ్రా' కమిషనర్ రంగనాథ్‌ను సుధాకర్‌రెడ్డి కలిశారు. బతుకమ్మకుంటకు సంబంధించిన పత్రాలు చూపించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ వాస్తవాలు తెలుసుకుని రెవెన్యూ, ఇరిగేషన్ రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం సుధాకర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వీహెచ్ బతుకమ్మకుంటను పార్కుగా మార్చాలని తప్పుడు సమాచారం ఇచ్చారని విమర్శించారు. గతంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన భూమిని వీహెచ్ తన పదవి పలుకుబడి ఉపయోగించి బాగ్‌అంబర్‌పేట వెల్ఫేర్ సొసైటీకి, తులసి కో-ఆపరేటివ్ సొసైటీలకు కేటాయించుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో అహ్మద్, హకీం, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలకు విస్తరించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' పనితీరు అద్భుతమని తెలంగాణ గంగతెప్పోత్సవ రాష్ట్ర కమిటీ సభ్యుడు, సికింద్రాబాద్ మహాకాళి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి గుండు జగదీశ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రాను జిల్లాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సాయికీర్త్(బాబ్జి) తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాల్‌రాజ్‌గౌడ్

గౌడ కల్లుగీత సంఘాల మద్దతు

రాంనగర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): చెరువులు, నాలాలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేస్తూ పర్యావరణాన్ని కాపాడుతున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా)కు గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. బుధవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో కమిటీ చైర్మన్ బాలగొని బాల్‌రాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్ విలేకరులతో మాట్లాడారు. హైడ్రాను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, సంస్థ కమిషనర్ రంగనాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా అక్రమ కట్టడాలను కూల్చివేయాలన్నారు. బలమైన యంత్రాగం ఏర్పాటు చేసి మరింత మంది సిబ్బందితో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆక్రమణలపై కొరడా ఝులిపించాలని కోరారు.

ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఎక్సైజ్) నూతన కార్యవర్గం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా షెడ్యూల్డ్ ట్రైబల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎక్సైజ్) కొత్త కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ శాఖలో పనిచేసే 336 మంది ఎస్టీ ఉద్యోగులు కార్యవర్గాన్ని అబ్కారీ భవన్‌లో ఎన్నుకున్నారు. తెలంగాణ అధ్యక్షుడిగా రంగారెడ్డి ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, ప్రధాన కార్యదర్శిగా మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్ కుమార్, కోశాధికారిగా శ్రీనివాస్, కో-ఆర్డినేటర్‌గా డి.తిరుపతి ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా మెదక్ డిప్యూటీ కమిషనర్ జె.హరికిషన్, అడ్వైజర్‌గా జాయింట్ కమిషనర్(డిస్టిలరీస్) సురేష్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 9 మంది ఉపాధ్యక్షులు, ఏడుగురు సహాయ కార్యదర్శులు, ఆరుగురు కార్యనిర్వాహక కార్యదర్శులు, 16 మంది సభ్యులుగా ఎన్నికయ్యారు.


ఫిఫా కప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి తదితరులు

ఇంటర్ కాంటినెంటల్ ఫిఫాకప్‌నకు నగరం ఆతిథ్యం

● 3, 6, 9 తేదీల్లో ఇండియా-మారిషస్ దేశాల మధ్య పోటీ

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాంటినెంటల్ ఫీఫాకప్ 2024కు హైదరాబాద్ నగరం ఆతిథ్యం ఇవ్వబోతుందని రాష్ట్ర క్రీడా సలహాదారుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో సెప్టెంబర్ 3, 6, 9 తేదీలలో ఇండియా-మారిషస్ దేశాల మధ్య ఈ కప్పు పోటీలు జరగబోతున్నాయని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ తరఫున పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. బుధవారం ఎల్బీ స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, రాబోయే రోజుల్లో తెలంగాణ క్రీడా ముఖచిత్రం మారిపోవడమే కాక మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీలకు హైదరాబాద్ నగరం వేదిక కాబోతుందని తెలిపారు. ఈనెల 29న గచ్చిబౌలి స్టేడియంలో జాతీయ క్రీడాదినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జీపీ పాల్గుణ, డిప్యూటీ డైరెక్టర్లు అనురాధ, చంద్రారెడ్డి, రవీందర్, శ్రీలత, సూర్యలత, సుజాత, ఇంజనీర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు

సభ్యత్వ నమోదులో కాచిగూడ ఆదర్శంగా నిలవాలి

● బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో కాచిగూడ డివిజన్‌ను నగరంలో ఆదర్శంగా నిలపాలని పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి బీజేపీ నగర కార్యాలయంలో నిర్వహించిన కాచిగూడ డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందాలన్నారు. మహిళలు, యువత పార్టీలో చేరేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్ ముదిరాజ్, పార్టీ నేతలు ఎక్కాల నందు, నందకిషోర్ యాదవ్, డా.సమతకృష్ణకుమార్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి త్యాగరాయ గానసభ మినీహాల్‌లో గాంధీనగర్ డివిజన్ బీజేపీ ముఖ్యనాయకుల సమావేశం పార్టీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ అధ్యక్షతన జరిగింది. రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీ బీజేపీ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.గోపాల్, వినయ్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, వీఎస్టీ రాజు, జి.శ్రీనివాస్, నవీన్‌కుమార్, అశోక్‌యాదవ్, సురేష్‌కుమార్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


గంగాధర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

చిక్కడపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ సెక్యూరిటీగార్డులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్ డా.ఇ.గంగాధర్‌కు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ సంబంధించిన వాటి రక్షణ కోసం దేశవ్యాప్తంగా ప్రైవేట్ సెక్యూరిటీని ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్యమ్మ, యాటల సోమన్న, అప్పారావు, జ్యోతి, రతుల్‌అలీ పాల్గొన్నారు.